సాక్షి సంగారెడ్డి

శనివారం । 18 । జనవరి । 2025



సూరీడు పువ్వు

ఇక్రిశాట్ పరిశోధనల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో వేసిన పొద్దుతిరుగుడు తోట విరబూసిన పూలతో ఇలా చూపుల బాణాలు వేస్తోంది. శుక్రవారం కనువిందు చేసిన ఈ దృశ్యం 'సాక్షి' కంటికి చిక్కింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

రైతు భరోసా సర్వే త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సర్వేను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

హత్నూర(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల మంజూరు, రైతు భరోసా సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. హత్నూర మండలం గుండ్లమాచునూరిలో అధికారులు చేస్తున్న సర్వేను శుక్రవారం చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారులతో సైతం కలెక్టర్ మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే చేసిన డేటా ఎంట్రీని సక్రమంగా పొందుపరచాలన్నారు. ఈ సర్వేలో తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎంపీఈవో యూసుఫ్ స్థానిక నాయకులు అధికారులు ఉన్నారు.

పౌరశాస్త్ర అధ్యాపకుడికి సన్మానం



సిద్ధారెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తోన్న సిద్ధారెడ్డి సీపీఎస్ ఉద్యోగుల సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడంపట్ల సహాధ్యాపకులు, సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిద్ధారెడ్డిని తోటి సహాధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సుధాకర్, మారుతి, ఉదయ్ ప్రసాద్, కాటి అబ్బయ్య, రమేశ్, సలావత్, రవికుమార్‌తోపాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

గృహ నిర్మాణశాఖ పీడీ చక్రపాణి



స్థలాన్ని పరిశీలిస్తున్న పీడీ చక్రపాణి

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చక్రపాణి స్పష్టం చేశారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి న్యాల్‌కల్‌లోని ఎంపీపీ ఆవరణలో నిర్మించతలపెట్టిన మోడల్ భవనం కోసం ఆయన శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...న్యాల్‌కల్‌లో నిర్మించిన భవనం మాదిరిగానే అన్ని గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకోవలసి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పారదర్శంగా జరుగుతాయని తెలిపారు.

మారిన టోల్ ఫ్రీ నంబర్

కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్

సంగారెడ్డి జోన్: సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వేలపై సందేహాలు ఫిర్యాదుల కోసం గురువారం కేటాయించిన (08455–272233) నంబర్‌ను కొన్ని సాంకేతిక కారణాలతో మార్చినట్లు కలెక్టర్ ఏవో పరమేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పాత నంబర్‌కు బదులుగా కొత్త టోల్ ఫ్రీ నంబర్ 08455–276155)కు కాల్ చేసి ఫిర్యాదులు చెప్పవచ్చని తెలిపారు.

ఉత్సాహంగా పాతపంటల ఊరేగింపు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పాత పంటల జాతర కార్యక్రమం వైభవోపేతంగా కొనసాగుతోంది. అందులోభాగంగా మూడవ రోజైన శుక్రవారం మండల పరిధిలోని గుంజోటి, హుస్సెల్లి గ్రామాల్లో పాత పంటల జాతరను నిర్వహించారు. ఉదయం ఆయా గ్రామాల్లో పాత పంటలతో కూడిన ఎడ్ల బండ్లకు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిరు ధాన్యాలతో కూడిన ఎడ్ల బండ్లను గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నృత్యాలు చేశారు.

ఆయుధాలు తప్పనిసరి

ఎస్‌ఐ, ఆ పైస్థాయి అధికారులకు ఎస్పీ ఆదేశాలు

- బీదర్, అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటన నేపథ్యంలో...
- అప్రమత్తమైన జిల్లా పోలీసులు..
- బీదర్‌లాంటి కాల్పుల ఘటన గతంలో కోహీర్‌లో..
- ఏకంగా ఎస్‌ఐపైనే కాల్పులకు తెగబడిన బ్యాంకు దోపిడీ ముఠా..



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీదర్ కాల్పుల ఘటన నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. పోలీసు అధికారులు తమ వ్యక్తిగత ఆయుధాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఎస్‌ఐ, ఆపైస్థాయి అధికారులు ఈ ఆదేశాలు తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న బీదర్‌లో గురువారం ఏటీఎం సిబ్బందిపై దుండగులు కాల్పులు జరిపి రూ.93 లక్షలు అపహరించిన సంగతి తెలిసిందే. ఈ దుండగులు జిల్లా మీదుగా హైదరాబాద్‌కు చేరుకుని అఫ్జల్‌గంజ్‌లోనూ కాల్పులకు తెగబడటం రాష్ట్రంలోనే కలకలం రేపింది. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బీదర్‌లో డబ్బులను చోరీ చేసి... సంగారెడ్డి జిల్లా మీదుగానే హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ దుండగులు బీదర్‌కు సమీపంలో ఉన్న సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలుండటంతో బీదర్ పోలీసులు జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో జిల్లా పోలీసులు గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతం నుంచే జిల్లాలో విస్తృతంగా వాహన తనిఖీలు చేశారు. అప్పటికే దుండగులు జిల్లా దాటి హైదరాబాద్‌కు చేరుకున్నారా..? లేదా జిల్లా పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలోనే వారి కళ్లు గప్పి హైదరాబాద్ వెళ్లారా? అనేది కీలకంగా మారింది. కాగా, బీదర్‌లో జరిగిన ఘటనలు ఎదురైనప్పుడు తమ వ్యక్తిగత ఆయుధాలు అందుబాటులో ఉంచుకుంటే దుండగులను ధీటుగా ఎదుర్కొనేందుకు వీలుంటుంది. ఎస్.ఐ ఆపై స్థాయి అధికారులకు వ్యక్తిగత ఆయుధం ఉంటుంది. కొందరు అధికారులు తమ ఆయుధాన్ని వెంట పెట్టుకోరు. అవసరం రాకపోవచ్చనే ఉద్దేశంతో ఆయుధాన్ని తమ వద్ద ఉంచుకోరు. తాజాగా ఈ కాల్పుల ఘటన రాష్ట్రంలోనే కలకలం రేపడంతో ఈ ప్రత్యేక ఆదేశాలు జారీ అయ్యాయి. మరోవైపు పోలీసులు వాహన తనిఖీలను కూడా ముమ్మరం చేశారు. నైట్ పెట్రోలింగ్‌ను పెంచారు.

భానూరు ఏటీఎంలో భారీ చోరీ..

రెండేళ్ల క్రితం బీడీఎల్ భానూరు పోలీసుస్టేషన్ పరిధిలోనూ ఏటీఎం చోరీ జరిగింది. ఓ దోపిడీ దొంగల ముఠా అక్కడి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు చెందిన ఏటీఎంను ఏకంగా గ్యాస్‌కట్టర్లతో కోసి అందులో ఉన్న డబ్బులను లూటీ చేసింది. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఇప్పుడు బీదర్‌తోపాటు, హైదరాబాద్‌లోనూ కాల్పుల ఘటనలతో ఉలికిపాటుకు గురైనట్లయింది.

జిల్లాలోనూ ఇలాంటి కాల్పుల ఘటనలు..

బీదర్‌లో చోటు చేసుకున్న మాదిరిగానే సంగారెడ్డి జిల్లాలోనూ గతంలో కాల్పుల ఘటన చోటు చేసుకుంది. ఓ అంతర్రాష్ట్ర బ్యాంకు దోపిడీ ముఠా కోహీర్‌లో ఓ బ్యాంకు దోపిడీకి ప్రయత్నించింది. అక్కడి అలారం మోగడంతో అప్పటి స్థానిక ఎస్‌ఐ ఆ బ్యాంకు వద్దకు చేరుకుని దుండగులను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో దుండగులు తమ వద్ద ఉన్న తపంచాతో ఎస్‌ఐపై కాల్పులకు తెగబడ్డారు. ఆ సమయంలో ఎస్‌ఐ తన వ్యక్తిగత ఆయుధాన్ని వెంట తీసుకెళ్లలేదు. ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించి బ్యాంకు దోపిడీని అడ్డుకున్నప్పటికీ, ఈ కాల్పుల్లో ఎస్‌ఐ తీవ్రంగా గాయపడ్డారు. ఇదే సమయంలో తన వెంట పర్సనల్ వెపన్ ఉంటే ఆ ముఠాను ధీటుగా ఎదుర్కొనేందుకు వీలు కలిగేది. 2013లో ఈ ఘటన చోటుకుంది. ఇప్పుడు కూడా ఇలాంటి కాల్పుల ఘటన చోటు చేసుకోవడంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్



జోగిపేట ఆటోడ్రైవర్ల సభలో మాట్లాడుతున్న బీపీటీఎంఎం జాతీయ కార్యదర్శి రవిశంకర్

జోగిపేట(అందోల్): ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ (బీపీటీఎంఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జోగిపేటలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్ల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు మంచిరోజులు వస్తాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల తెలంగాణలో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగం అయ్యాయని, అనేకమంది ఆటో డ్రైవర్లు ఆర్థిక బాధలు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు ద్వారా ఆటో డ్రైవర్లకు వారి కుటుంబాలకు వైద్య సౌకర్యంతో పిల్లలకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య అందించాలని కోరారు. అదేవిధంగా డబుల్ బెడ్ రూం ఇళ్లను కూడా కేటాయించాలన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15 లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు త్వరలో బీమా శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరిస్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీఎంఎస్ అనుబంధ తెలంగాణ ఆటో, ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగులయ్య ఆధ్వర్యంలోఈ సభకు తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ప్రతినిధులు యం.డి హాబీబ్, శ్రీధర్‌రెడ్డి బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకుల శంకర్, జోగిపేట ఆటో యూనియన్ నాయకులు బాబుల్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మార్పులు అవసరం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు రావాల్సిన అవసరముందని, ఆ దిశగా సంగారెడ్డిలో జరగబోయే సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగవ మహాసభల్లో సమరశీల పోరాట కర్తవ్యాలను రూపొందించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్లు, బీజేపీ పదేళ్లు, కాంగ్రెస్ 13 నెలలు పాలించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఓటర్లుగా మాత్రమే చూశాయని ఏనాడూ వారిని ప్రజలుగా గుర్తించలేదన్నారు. ప్రజల జీవితాల్లో పెను మార్పులు తీసుకొచ్చేందుకు దోహదపడే ఏ ఒక్క మంచి నిర్ణయం, పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న కోటీ 30 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. పైగా కేంద్రంలోని ప్రధాని మోదీ మాత్రం రోజుకు రూ.178 రూపాయల వేతనం సరిపోతుందంటూ జీవో జారీ చేయడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కౌలు రైతులకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు నయాపైసా సాయం చేయలేదన్నారు. విద్య, వైద్యం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు అవి అందని ద్రాక్షలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25న జరిగే బహిరంగ సభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, బృందాకరత్, బీవీరాఘవులు, విజయరాఘవన్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీసభ్యులు చెరుపల్లి సీతారాములు, నాగయ్య, బి.వెంకట్, సాయిబాబు వంటి వారు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు, జ్యోతి, పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇళ్లు

- 25 మండలాల్లో నిర్మాణం
- ఇప్పటికే రెండుచోట్ల ప్రారంభమైన ఇళ్ల పనులు
- మిగతాచోట్ల భూమి కోసం పరిశీలన



సంగారెడ్డిలో కొనసాగుతున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇల్లు మంజూరు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. వీటి ఆధారంగా సర్వే చేపట్టి అర్హులైన వారిని ఎంపిక చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగా జిల్లాలోని 25 మండల కేంద్రాల్లో నిర్మాణం చేపట్టేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మండల ప్రజాపరిషత్తు కార్యాలయం ఆవరణలో మోడల్ ఇంటి నిర్మాణం పనులకు ఇటీవల మంత్రి దామోదర రాజనర్సింహ భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే.

అవగాహన కోసమే ఇక్కడ నిర్మాణం...

వివిధ పనులపై నిత్యం మండల కేంద్రానికి ప్రజలు వస్తుంటారు. వారందరికి తెలిసే విధంగా మండల పరిషత్తు కార్యాలయాలను ఎంచుకున్నట్లు సమాచారం. సంగారెడ్డితోపాటు పటాన్‌చెరు మండల కార్యాలయం ఆవరణలో నిర్మాణపు పనులు కొనసాగుతున్నాయి. మిగతా మండల కేంద్రాల్లో స్థలాలను పరిశీలించి, ఎంపిక చేస్తున్నారు. మిగితా వాటికి త్వరలో భూమి పూజ చేయనున్నారు. మోడల్ ఇందిరమ్మ ఇళ్లు 400 చదరపు అడుగుల పరిధిలో నిర్మాణం చేపట్టనున్నారు. హాల్, కిచెన్, అటాచ్డ్ బాత్‌రూమ్‌తోపాటు బెడ్ రూమ్ నిర్మించనున్నారు. ఇంటి నమూనాను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ హౌసింగ్ డైరెక్టర్ ఇటీవల విడుదల చేశారు. రెండు నెలల వ్యవధిలో రూ.5లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణంతోపాటు విద్యుత్తు సౌకర్యం కల్పించటంతోపాటు రంగులు వేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

అవగాహన కల్పించేందుకే...



ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అందించే రూ.5లక్షలతో మోడల్ ఇందిరమ్మ ఇళ్లు మండల ప్రజాపరిషత్తు కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్నారు. జిల్లాలో 25 మండల కేంద్రాల్లో మోడల్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ఇప్పటికే సంగారెడ్డితోపాటు పటాన్‌చెరు మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో పనులు కొనసాగుతున్నాయి.

–చలపతిరావు, పీడీ, హౌసింగ్, సంగారెడ్డి జిల్లా

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



సర్వే వివరాలు ఆర్డీవో పాండును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రధాన పథకాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు స్పష్టం చేశారు. చౌటకూర్ మండలంలోని సుల్తాన్పూర్, సరాఫ్ పల్లి గ్రామాలను కలెక్టర్ శుక్రవారం సందర్శించి, సర్వే బృందాల పనితీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సర్వేలో తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. సుల్తాన్పూర్, సరాఫ్ పల్లి గ్రామాలలో కలెక్టర్ స్వయంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారి పరిస్థితులను సమీక్షించారు. సర్వే బృందాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, తగిన సూచనలు చేశారు. కలెక్టర్ క్రాంతి వెంట అందోల్ ఆర్డీవో పాండు, తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అక్రమ లేఆఫ్‌ను రద్దు చేయాలి

- యూబీ పరిశ్రమ నిర్ణయంపై ఉద్యమిస్తాం
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కొండాపూర్ మండలంలోని యూబీ పరిశ్రమ ప్రకటించిన అక్రమ లేఆఫ్‌ను వెంటనే రద్దు చేయాలని లేకుండా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు హెచ్చరించారు. యూబీ పరిశ్రమ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమ కార్మికులు శుక్రవారం పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఏవో, డీసీఎల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్కారాములు మాట్లాడుతూ యూబీ యాజమాన్యంకు ప్రభుత్వం నుంచి రావలసిన రూ.900 కోట్ల బకాయిలు ఇవ్వడం లేదన్నారు. మద్యం రేట్లు పెంచడం లేదని ఆకస్మికంగా ఈనెల 8నుంచి ఉత్పత్తి నిలిపివేసిందని తెలిపారు. పర్మినెంట్ కార్మికులకు లేఆఫ్ ప్రకటించడం చట్ట విరుద్ధమన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం చర్చించుకోవాల్సిన అంశాలను కార్మికుల మీద రుద్ది, వారిని రోడ్డుపాలు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. పరిశ్రమ ఉత్పత్తులు నిలిపివేయడంతో 2,000 మంది కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డుమీద పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సం'వృద్ధి' దిశగా డ్వాక్రా

- డ్వాక్రా సంఘాల్లో కొత్త సభ్యత్వాలు
- ప్రయోజనాలు కల్పిస్తున్న మహిళా సంఘాలు
- 4,408 సభ్యులను చేర్పించాలని లక్ష్యం



ఇస్మాయిల్ ఖాన్ పేటలో సంఘం సభ్యులుగా చేరిన మహిళలకు సన్మానం చేస్తున్న అధికారులు

సంగారెడ్డిటౌన్: రాష్ట్రంలో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులోభాగంగా మహిళా సంఘాలలో మరింతమంది కొత్త సభ్యులను చేర్చుకునేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు రచించింది. మహిళా సంఘాలలో సభ్యత్వం తీసుకుంటే ఒనగూడే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో మహిళా సంఘాల్లో చేరేందుకు వారు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక డ్వాక్రా సంఘాల సభ్యులు కూడా కొత్త సభ్యత్వాలను చేర్చుకునేందుకు ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

చేరిన వారికి ప్రత్యేక సన్మానాలు

మహిళా సంఘాల్లో చేరిన కొత్త సభ్యులను జిల్లా అధికారులు ఘనంగా సన్మానాలు చేస్తున్నారు. సంఘంలో చేరిన కొత్త మహిళలకు బొట్టు పెట్టి, శాలువాతో సన్మానించి పూల మొక్కలతో సంఘంలోకి ఆహ్వానిస్తున్నారు. సభ్యురాలి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామంలోని మహిళలకు ఆర్థికంగా స్థిరపడే విధంగా పొదుపు సంఘాలలో రుణాలు అందిస్తున్నారు. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలు స్వయం సమృద్ధి సాధించడంతోపాటు మరో పదిమందికి ఉపాధి చూపించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. వివరాలను సేకరించి సంఘంలో చేర్పించే విధంగా అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నారు.


బ్యాంకు లింకేజ్, శ్రీనిధి రుణాలు అందజేత

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, సాధికారతే లక్ష్యంగా పేదరిక నిర్మూలన సంస్థ అనేక చర్యలు చేపట్టింది. సంస్థ ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్, శ్రీనిధి రుణాలు అందిస్తూ మహిళా సంఘాల సభ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. బ్యాంకర్లూ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 18,465 మహిళా సంఘాలు

జిల్లాలో మొత్తం 1,91,596 మహిళా సభ్యులున్నారు. స్వయం సహాయక సంఘాలు 18,465 ఉండగా.. అందులో గ్రామ సమాఖ్యలు 695, మండల సమాఖ్యలు సంఘాలు 25 ఉన్నాయి. ఈ ఏడాదిలో 4,408 సభ్యులను చేర్పించాలని లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 3,368 మహిళలకు సభ్యత్వాలను ఇచ్చారు. మార్చి నెలాఖరునాటికి పూర్తిస్థాయిలో సభ్యత్వాలు చేస్తామంటున్నారు.

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం



గ్రామీణ మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాల ద్వారా వివిధ రకాల ఉపాధి కల్పిస్తూ బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తున్నాం. సంఘంలో సభ్యులుగా చేరేందుకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం.

– జంగారెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

ఇవీ ప్రయోజనాలు...

- మహిళా సంఘం సభ్యులు రుణం తీసుకున్న తర్వాత మరణిస్తే రూ.2 లక్షలు
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా
- వ్యక్తిగతంగా రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం
- గ్రామీణ మహిళలకు ఉపాధికోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు
- తెల్లరేషన్ కార్డు ఉండి, గ్రామీణ ప్రాంతం చెందిన 18 ఏళ్ల వయసు, దాటిన వారు అర్హులు.
- ఈ ఏడాదిలో రుణ బీమా 119, ప్రమాద బీమా 6 మందికి ఇవ్వనున్నారు
- సభ్యత్వం తీసుకున్నప్పుడు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు.

సర్వే ప్రక్రియను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్ తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల సర్వే పకడ్బందీగా చేపట్టాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని చిలపల్లి, ఎల్గోయి, చిలమామిడి, గుంతమర్పల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం సర్వే కార్యక్రమం కొనసాగింది. పలు గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్ సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

అధికారులు సమన్వయంతో సర్వే చేపట్టాలన్నారు. ఇక మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పర్యటించి, సర్వే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్, అధికారులు రామారావు, నర్సింలు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కీయాస్క్‌ల పరిశీలన

వినియోగించేలా కమిషనర్ ఆదేశం

సిద్దిపేటజోన్: వీధి వ్యాపారుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం నిర్మించిన స్ట్రీట్ వెండర్ కీయాస్క్ నిరుపయోగ స్థితి గతులపై గురువారం సాక్షిలో ప్రచురించిన కథనానికి బల్దియా స్పందించింది. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పట్టణంలోని కీయాస్క్ లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 40 కీయాస్క్ లను డ్రా పద్ధతిలో పొందిన వారి వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల మేరకు వీధి వ్యాపారులు కీయాస్క్‌లను తెరిచి ఉంచేలా చూడాలని, వాటిని వినియోగించని వారి నుంచి స్వాధీనం చేసుకొని అర్హులైన స్ట్రీట్ వ్యాపారులకు కేటాయించాలని మెప్మా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

టెండర్లు ఖరారు



వేలంలో ఉద్యోగులు, టెండర్ దారులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల మహాశివ రాత్రి, మాఘ అమావాస్య ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేయడానికి శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలు ఖరారు అయ్యాయి. తాత్కాలిక తడకల పందిరి వేయడానికి రూ.2.34 లక్షలు, విద్యుత్ దీపాల అలంకరణకు రూ.3.40 లక్షలు పాట పాడి టెండర్ దారులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఉద్యోగులు, టెండర్ దారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు: వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని ఎస్వీ హోమ్స్‌లో నివాసముంటున్న అప్పలస్వామి ఈనెల 1న బట్టల బ్యాగు తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం కుమారుడు గోపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి..

గజ్వేల్‌రూరల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బేడ యాదగిరి(40) మద్యం తాగివచ్చి బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం బయటకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం గజ్వేల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యక్తి మృతి కేసులో ఇద్దరికి జరిమానా

వర్గల్(గజ్వేల్): వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరికి కోర్టు జరిమానా విధించినట్లు వర్గల్ మండలం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఐదేళ్ల కిందట నాచారం టెంపుల్‌లో స్వీపర్‌గా పనిచేసే ఎం.నర్సయ్య ఆలయం నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. నాచారం గ్రామానికి చెందిన పచ్చకుర నవీన్(19) బైక్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు బైక్ నడిపిన నవీన్‌తోపాటు బైక్ యజమాని జంపకట్టి రాజుపై అప్పట్లో కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా శుక్రవారం ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చగా నవీన్‌కు రూ.11,000, యజమాని రాజుకు రూ.1,000 జరిమానా విధిస్తూ గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి బీ. ప్రియాంక తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పార్క్ నిర్మాణం.. ఇదిగో ఆహ్లాదం

దుబ్బాకలో సిద్ధమైన పార్క్, ఎఫ్ఎస్‌టీపీ

- రూ.40 లక్షలతో పిల్లల కోసం ఏర్పాటు
- రూ.73 లక్షలతో ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణం
- ప్రజలకు నిత్యం ఆహ్లాదకర వాతావరణం
- నేడు మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రారంభం



18వ వార్డులో ఏర్పాటు చేసిన పిల్లల పార్క్

దుబ్బాకటౌన్: దుబ్బాక అభివృద్ధే లక్ష్యంగా దుబ్బాక మున్సిపల్ పాలక వర్గం ముందుకు సాగుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు ఆరోగ్యం పై దృష్టి సారించడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి పోవడంతో పెద్దలు, పిల్లలు స్మార్ట్ ఫోన్‌కు బానిసలవుతున్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గతంలోనే దుబ్బాక పాలక వర్గం పలు వార్డుల్లో ఓపెన్ జిమ్‌లను ప్రారంభించగా, నేడు పిల్లల కోసం పట్టణంలో 18వ వార్డులో సకల వసతులతో పార్క్‌ను ఏర్పాటు చేశారు.

ఎట్టకేలకు.. మూడేళ్లకు

దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాల సమీపంలో వెయ్యి గజాల ప్రభుత్వ స్థలంలో పిల్లల పార్క్ నిర్మాణానికి రూ.40 లక్షల వ్యయంతో 2021 సంవత్సరంలో అధికారులు చర్యలు చేపట్టారు. పలు కారణాలతో పార్క్ ఏర్పాటు ఆలస్యమవుతూ వచ్చింది. ఎన్నో అవరోధాలను దాటి మూడేళ్ల తర్వాత పార్క్ నిర్మాణం పూర్తయ్యింది. 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులను కలుపుకొని అధికారులు పార్క్ నిర్మాణం పూర్తి చేశారు. దుబ్బాక పట్టణ శివారులోని ఐటీఐ కళాశాల సమీపంలో రూ.73 లక్షల టీఎఫ్ఐడీసీ నిధులతో 2021 సంవత్సరంలో అధికారులు మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ప్రారంభం పలుమార్లు వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది.

మంత్రి కొండా సురేఖతో ప్రారంభం

శనివారం పార్క్‌ను, ఎఫ్ఎస్‌టీపీని ప్రారంభించనున్నారు. ప్రారంభానికి సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతోపాటు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు హాజరవుతారని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు.

ఎన్నో అవరోధాలను దాటి



దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సాయశక్తుల కృషి చేస్తున్నాం. పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడేళ్లు అవుతుంది. పలు కారణాలతో నిర్మాణం ఆలస్యమైంది. ఎన్నో అవరోధాలను దాటి సకల వసతులతో పార్క్‌ను పట్టణ వాసుల పిల్లల కోసం సిద్ధం చేశాం.

–గన్నె వనిత, మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రారంభానికి సర్వం సిద్ధం



దుబ్బాక పట్టణంలోని 18వ వార్డులో పిల్లల పార్కు, పట్టణ శివారులోని ఐటీఐ కళాశాల సమీపంలో గల మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం ప్రారంభానికి సర్వం సిద్ధం చేశాం.

– రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్



పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడు బల్లలు

పిల్లలకు, పాఠశాల విద్యార్థులకు

ఆహ్లాదకరమైన వాతావరణంలో, సకల వసతులతో పార్క్‌ను అందంగా తీర్చిదిద్దారు. పార్క్ చుట్టూ ప్రహరీ, నీటి సౌకర్యం, ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. పిల్లల మనస్సును మంత్ర ముగ్ధులను చేసేలా చెట్ల పత్రాల ఆకారంలో లైట్లు, వివిధ పండ్ల ఆకారంలో కుర్చీలను ఏర్పాటు చేశారు. పార్క్ మధ్యలో పచ్చటి గడ్డితో తల్లి, బిడ్డను పోలిన అందమైన ఆకృతిని అద్భుతంగా నిర్మించారు. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, వార్డు పిల్లలకు ఆటలు ఆడుకోవడానికి పార్క్ ఎంతగానో ఉపయోగ పడుతుంది. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పచ్చటి గడ్డితో తల్లీబిడ్డ ఆకృతి



కాలిపోయిన నోట్లు

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన డబ్బులు

సుమారు రూ.2 లక్షల వరకు నష్టం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం పంచగామలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో కిరాణాదుకాణం దగ్ధమై రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన తెనుగు శంకర్ గ్రామంలోని ఇంటి వద్ద షెడ్డు ఏర్పాటు చేసుకొని కిరాణా దుకాణం నడుపుతున్నాడు. తెల్లవారు జామున షెడ్‌లోంచి మంటలు రావడాన్ని గుర్తించిన కుటుంబీకులు షెడ్డు తెరిచి మంటలార్పే ప్రయత్నం చేసినా ఆ లోపే జరగాల్సిన నష్టం జరిగింది. రూ.50 వేల విలువ చేసే కిరాణా సామగ్రి, ఫ్రిజ్, రూ.లక్ష నగదుతోపాటు, డ్వాక్రా గ్రూపు లీడర్ అయిన శంకర్ తల్లి బ్యాంకులో రుణ వాయిదా చెల్లించడానికి సభ్యుల వద్ద వసూలు చేసిన రూ.50 వేలు కాలి బూడదయ్యాయి. మొత్తం రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



అగ్నిప్రమాదంలో దగ్ధమైన సామగ్రి

ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



ఘటనా స్థలంలో వీరస్వామి గౌడ్

తొగుట(దుబ్బాక): ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బుర్ర వీరస్వామిగౌడ్ (60) కుల వృత్తితోపాటు గ్రామంలో టీ కొట్టు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగా ఉదయం ఈత వనంలోకి వెళ్లాడు. మోకు బిగించుకొని చెట్టు పైకి ఎక్కుతుండగా మధ్యలో అదుపుతప్పి కిందపడిపోయాడు. తోటి కార్మికులు చికిత్స కోసం సిద్దిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య కమలమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం మానవత్వంతో ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మద్యం మత్తులో పడిపోయి వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో పడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన సుదర్శన్ గులాబ్ (40) బతుకుదెరువు కోసం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి రామరాజు నగర్‌కి వచ్చి ఉంటున్నాడు. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ ఉండేవాడు. భార్య రెండేళ్ల కిందట విడిపోయి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై ఎక్కడపడితే అక్కడ తాగి తిరుగుతూ ఉండేవాడు. 16న ముత్తంగి హరి దోష సమీపంలో పడిపోయి ఉండటంతో స్థానికులు 108 కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా మృతి చెందాడు. మృతుడి పెదనాన్న బన్సీలాల్ గోపీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి యువకుడు..

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని హసన్‌మహ్మద్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన తెరగొర్రి అనిల్ (25) వ్యవసాయంతోపాటు కూలీ పని చేస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం సుంగుపేటకు చెందిన రాధతో నాలుగేళ్ల కిందట వివాహం జరుగగా ఒక కుమారుడు ఉన్నాడు. నెలరోజుల కిందట భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో రాధ తల్లిగారింటికి వెళ్లింది. 16న సాయంత్రం కాలకృత్యాలకు వెళ్లిన అనిల్ రాత్రి అయినా ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం చెరువు గట్టుపై అనిల్ పర్సు, ఫోన్ ఉండడంతో గ్రామస్తులు చెరువులోకి దిగి వెతకగా మృతదేహం లభ్యమైంది. అనిల్‌కు ఈత రాకపోవడంతో కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు మృతుడి తల్లి దుర్గమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అనిల్(ఫైల్)

చికిత్స పొందుతూ మహిళ..

దుబ్బాకరూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. సౌడు రాజమణి(48), భర్త పిల్లలతో వ్యవసాయం చేసుకుంటూ జీవించేది. కొద్ది రోజులుగా మద్యానికి బానిసైంది. మద్యం మానేయాలని ఇంట్లో వారు చెప్పిన వినకుండా గొడవ పడేది. 13న మద్యం తాగిన రాజమణి ఇంట్లో గొడవ చేయగా భర్త మందలించి బయటకు వెళ్లాడు. మద్యం మత్తులో గడ్డి మందు తాగి భర్తకు చెప్పింది. వెంటనే ఆమెను 108లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త నాంపల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



రాజమణి(ఫైల్)

జైలు శిక్షతోపాటు జరిమానాలు

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నాం వీరిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ.2 వేలు జరిమానా, మరో ఐదుగురికి రూ.1,500 , మరో వ్యక్తికి జరిమానాతోపాటు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలో గురువారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పాత బస్టాండ్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 10 మంది పట్టుపడ్డారు. శుక్రవారం జిల్లా న్యాయస్థానంలో హాజరుపర్చగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి మూడు రోజులు జైలు, మరొకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే మరో వ్యక్తికి ఒక్క రోజు జైలు, మిగితా ఆరుగురికి రూ.1,500 జరిమానా, ఇంకో వ్యక్తికి రూ.1,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వట్‌పల్లి(అందోల్): బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ముగ్గురు యువకులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అందోలు మండల పరిధిలోని తాలెల్మ శివారులో చోటు చేసుకుంది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. అందోలు మండలంలోని కిచ్చన్నపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై తాలెల్మ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. గ్రామ శివారులోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో సుధాకర్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో సీఐ అనిల్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి అటుగా వెళ్తూ ప్రమాదాన్ని గమనించారు. 108 అంబులెన్స్ వాహనాన్ని పిలిపించి క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటను చార్మినార్ జోన్‌లో కలపాలి

మంత్రి పొన్నంకు టీఎన్జీవో వినతి

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్ పరిధిలో కలపాలని జిల్లా టీఎన్జీవో సంఘం ప్రతినిధులు శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పరమేశ్వర్, విక్రమ్ రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు కలిసి సమస్యలు వివరించారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో తీరని అన్యాయం జరిగిందని, చార్మినార్ జోన్ పరిధిలో సిద్దిపేట జిల్లా ఉండేలా చూడాలని 317 జీఓ ఉపసంఘం కమిటీ సభ్యులైన మంత్రికి తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి, సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సమస్య తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు ప్రతినిధులు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ప్రతినిధులు సురేందర్ రెడ్డి, అశ్వాక్ అహ్మద్, శశిధర్, సత్యనారాయణ, నగేశ్, సుమన్ ఉన్నారు. అదే విధంగా సిద్దిపేట ఎల్లమ్మ దేవాలయం బోనాల పండుగ నేపథ్యంలో బారాహిమాం నుంచి ఎల్లమ్మ గుడి దారిలో బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉన్నాయని గౌడ సంఘం ప్రతినిధులు బాల్ కిషన్‌గౌడ్, సతీష్ గౌడ్, అనిల్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించారు. మంత్రి స్పందించి అక్కడే ఉన్న కలెక్టర్ మను చౌదరికి ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు కోమటి చెరువు బైపాస్ వద్ద ఉన్న సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం గురించి మంత్రికి తెలియజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవో ప్రతినిధులు

తల్లితో గొడవపడి యువకుడి ఆత్మహత్య



లక్ష్మణ్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): తల్లితో గొడవపడ్డ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎంబరి లక్ష్మణ్ (23) తండ్రి యాదయ్య మూడేళ్ల కిందట చనిపోయాడు. తల్లి మల్లమ్మ, సోదరి గ్రామంలో నివాసం ఉంటున్నారు. కొంతకాలం నుంచి లక్ష్మణ్ హైదరాబాదులో కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండుగ కోసం గ్రామానికి వచ్చిన లక్ష్మణ్ సొంతంగా కారు కొంటానని, డబ్బులు సమకూర్చాలని తల్లితో గొడవ పెట్టుకున్నాడు. పెళ్లి కావాల్సిన ఆడపిల్ల ఇంట్లో ఉండడంతో పెళ్లి ఎలా చేసేది అంటూ వారించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మణ్ తెల్లవారుజామున ఇంట్లోని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్తతో గొడవపడి భార్య..

గజ్వేల్‌రూరల్: భర్తతో గొడవపడిన భార్య క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మోనుపాల్‌కు బీహార్‌కు చెందిన పుతుల్ కుమారి(19)తో ఏడాదిన్నర కిందట వివాహం కాగా ప్రజ్ఞాపూర్‌కు వచ్చి ఉంటున్నాడు. ఇక్కడే ఓ ఐరన్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మోనుపాల్ సిగరెట్ తాగుతున్నట్లు భార్యకి వాట్సాప్‌లో అతడి స్నేహితుడు ఫొటో పంపించాడు. ఈ విషయమై శుక్రవారం ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కొద్దిసేపటి తర్వాత మోనుపాల్ ఇంటిపైన నిద్రించడానికి వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కిందికి వచ్చి చూసేసరికి భార్య ఉరేసుకొని కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.



కుమారి మృతదేహం

ప్రభుత్వ మోసాలపై ఎండగట్టండి

నియోజకవర్గ శ్రేణులతో టెలీ కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న హరీశ్ రావు

సిద్దిపేటజోన్: జనవరి 26 నుంచి అమలు చేయనున్న ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసంను ఎండగట్టాలని, ప్రతీ ఒక్కరూ గ్రామ సభల్లో పాల్గొని పేద ప్రజల కోసం నిలబడి, అర్హులైన, నిజమైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ పార్టీ శ్రేణులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాలు, పార్టీ కేడర్ అనుసరించే విధానాన్ని గురించి దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేసిందని, ఇదే విషయాన్ని గ్రామాల్లో, పట్టణాల్లో, గ్రామ సభల్లో చర్చకు తేవాలని సూచించారు. గ్రామ సభలకు పార్టీ శ్రేణులు వెళ్లి నిజమైన, అర్హులైన పేదలకు, రైతులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఆత్మీయ భరోసాను కోతలు లేకుండా అమలు చేయాలని అడగాలని, జిల్లాలో 2 లక్షల ఉపాధి హామీ కూలీలు ఉన్నారని, ప్రభుత్వ నిబంధనలతో 75 వేల మంది కూలీలకు వర్తిస్తుందని, మిగితా కూలీల పరిస్థితి గురించి నిలదీయాలని సూచించారు. ఎకరం లోపు భూమి ఉన్న రైతుకు కూడా పథకం అమలు చేసేలా గ్రామ సభల్లో అడగాలన్నారు. రైతు భరోసాలో ఏరివేతలు లేకుండా, న్యాయంగా ఉండే వారికి, అర్హులైన రైతులకు భరోసా వచ్చేలా చూడాలని సూచించారు.

మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారం

గర్భం దాల్చడంతో హత్నూర మండలంలో ఆలస్యంగా వెలుగులోకి

హత్నూర(సంగారెడ్డి): అభం శుభం తెలియని మతిస్థిమితం లేని బాలిక గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు..హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ఓ బాలిక 9వ తరగతి చదివి ఇంటి వద్దే ఉంటుంది. తల్లి దండ్రులు మేస్త్రీ పని కోసం కూలి పనులకు వెళ్లగా కొందరు వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడటంతో గర్భం దాల్చింది. ఈ విషయమై ఇటీవల గ్రామంలో పంచాయితీ పెట్టారు. ఎవరు చేశారనేది తెలియదని, దుండగులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్సై సుభాష్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు.

వైద్యం అందిస్తున్నాం: జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి

బాలిక 5 నుంచి 6 నెలల గర్భిణీగా ఉంది. ఆమెకు వైద్య సేవలు అందిస్తున్నాం. బాలిక గర్భం దాల్చిన విషయం జిల్లా శిశు సంక్షేమ అధికారి దృష్టికి సైతం తీసుకెళ్లి సమాచారం ఇచ్చాం. వైద్య సేవలు మాత్రమే మేము అందిస్తాం. పూర్తిస్థాయి విచారణ జిల్లా శిశు సంక్షేమ అధికారులు చేపట్టనున్నారు.

కన్న కొడుకును చంపిన తండ్రి

- మద్యానికి బానిసై వేధిస్తున్నాడని కత్తితో నరికి హత్య
- అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామంలో ఘటన



శ్రీకాంత్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తున్నాడని కన్న కొడుకునే తండ్రి హత్య చేశాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన మాదాసు దుర్గయ్య, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారులకు కాలేదు. దుర్గయ్య బట్టలు కుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు మాదాసు శ్రీకాంత్ (29) డ్రైవింగ్ చేస్తుండేవాడు. శ్రీకాంత్ మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తుండేవాడు. రెండు రోజుల కిందట గొడవలు జరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా శ్రీకాంత్‌కు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కానీ తనలో మార్పు రాలేదు. గురువారం రాత్రి సైతం తాగి తల్లిదండ్రులను చంపుతానని ఇంట్లో గొడవ చేశాడు. దీంతో విసుగు చెందిన తండ్రి దుర్గయ్య శ్రీకాంత్ నిద్రపోగానే కత్తితో విచక్షణారహితంగా నరిగి చంపేశాడు. శుక్రవారం వేకువజామునే దుర్గయ్య మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ప్రమీలా ఫిర్యాదు మేరకు దుర్గయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రంగాకృష్ణ తెలిపారు.